క్లుప్తంగా

నేడు కేటీఆర్ జన్మదిన వేడుకలు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఆపార్టీ పట్టణాధ్యక్షుడు గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తరలిరావాలని కోరారు.

పరామర్శ

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్‌కు చెందిన మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గొట్టం దశరథ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా కార్యదర్శి కాసాని వీరేశం, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టి రాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్ ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

శివ్వంపేట(నర్సాపూర్): చిన్ననాటి స్నేహితుడు అనారోగ్యంతో మృతి చెందడంతో తోటి స్నేహితులు ఆదివారం అతడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. మండల పరిధి గుండ్లపల్లికి చెందిన దుబ్బ మహేష్ అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 20 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వినోద్, మహేష్, ప్రశాంత్, గణేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



పాడి గేదె కళేబరం

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని చిన్నగొట్టిముక్లలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చెన్నాపూర్ మల్లేష్ పాడి గేదెలతో జీవనోపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగానే పాడి గేదెలను మేత కోసం పొలం వద్దకు తీసుకెళ్లాడు. విద్యుత్ స్తంభం నుంచి బోరు మోటారుకు ఏర్పాటు చేసిన వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె విలువ రూ. 70 వేలు ఉంటుందని బాధిత చెప్పాడు.

తుమ్మ కొమ్మల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

శివ్వంపేట(నర్సాపూర్): తూప్రాన్– నర్సాపూర్ హైవే శివ్వంపేట గ్రామ శివారు రాజన్నవాగు బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న తుమ్మ కొమ్మలను అధికారులు తొలగించారు. ఆదివారం 'సాక్షి'లో ప్రమాదకరంగా తుమ్మ కొమ్మలు అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన హైవే ఏఈ రామకృష్ణ తన సిబ్బందితో బ్రిడ్జిపై ఉన్న కొమ్మలను తొలగించడంతో పాటు పిచ్చి మొక్కలను తొలిగింపజేశారు.

ఆర్థిక సాయం



చిన్నశంకరంపేట(మెదక్): ఇటీవల చేపల వేటకు వెళ్లి మృతిచెందిన మండలంలోని చందంపేటకు చెందిన వడియారం స్వామి కుటుంబ సభ్యులకు స్నేహబృందం సభ్యులు రూ. 30 వేల ఆర్థిక సహాయం అందించారు.

సబ్బుబిళ్లపై ఆజాద్



గజ్వేల్‌రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకొని సమస్యల పరిష్కారానికి పోరాటం సాగించాలని రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామ రాజు పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 117వ జయంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలో సబ్బు బిళ్ల పై ఆయన రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు.

గురుకులం.. బహుదూరం

- అల్లాదుర్గం నుంచి వట్‌పల్లికి తరలింపు
- ఆందోళనకు సిద్ధమవుతున్న జేఏసీ నేతలు



అల్లాదుర్గంలో ఖాళీగా ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్

అల్లాదుర్గం(మెదక్): అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గంకు నాలుగేళ్ల క్రితం మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల బాలుర పాఠశాల మంజూరైంది. స్థానికంగా భవనం లేకపోవడంతో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిన్నకంజర్లలో కొనసాగిస్తున్నారు. నాలుగేళ్లు గడిచినా ప్రభుత్వం సొంత భవనం నిర్మించలేదు. అయితే ప్రభుత్వం ఏ నియోజకవర్గంలో మంజూరు చేసిన గురుకులంను అదే నియోజకవర్గంలో కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. సంబంధిత అధికారులు గురుకుల పాఠశాల భవనం కోసం నియోజకవర్గంలోని రాయికోడ్, రేగోడ్, అల్లాదుర్గం, వట్‌పల్లి మండలాల్లో పలు భవనాలు పరిశీలించారు. అయితే అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సొంత మండలం వట్‌పల్లికి తరలించేందుకు కలెక్టర్ అనుమతితో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే నియోజకవర్గంలోని మరో మండలానికి తరలిస్తే పెద్ద ఎత్తున అందోళన చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరిస్తున్నారు. ఇటీవలే ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ వద్దకు వెళ్లి అల్లాదుర్గంలోనే గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే అందరం రాజీనామా చేస్తామని చెప్పినట్టు తెలిసింది.

మూతపడిన హాస్టల్

అల్లాదుర్గం ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులు లేక మూతపడిందని.. గురుకుల పాఠశాలకు ఉపయోగించుకోవచ్చని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. హాస్టల్ మూతపడడంతో భవనం వృథాగా మారిందని, గురుకుల విద్యార్థులకు అవసరమయ్యేలా భవనంలో మార్పులు చేస్తే ఇబ్బందులు ఉండవంటున్నారు. అల్లాదుర్గం మండలానికి చెందిన ఓ వ్యక్తి సోషల్ వెల్ఫేర్‌లో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నారని.. అతనికి చెందిన కాలేజీ భవనం వృథాగా ఉండడంతో అద్దె కోసం పైరవీ చేసి అదే భవనంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

వట్‌పల్లిలోనే ఏర్పాటు

ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలను సొంత నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అల్లాదుర్గం గురుకుల పాఠశాల ఏర్పాటుకు రాయికోడ్, అల్లాదుర్గం, రేగోడ్, వట్‌పల్లిలో భవనాలు పరిశీలించాం. వట్‌పల్లిలో కాలేజీ భవనం పాఠశాలకు అనువుగా ఉండడంతో ఎంపిక చేశాం. ఈవిషయం ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వట్‌పల్లిలో కొనసాగించేందుకు అనుమతి ఇచ్చారు.

– ప్రభాకర్, ఆర్‌సీఓ

ఫుట్‌పాత్‌పై ట్రాన్స్‌ఫార్మర్



నర్సాపూర్ జాతీయ రహదారి పక్కన ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

నర్సాపూర్: జాతీయ రహదారి పక్కన కాలినడక కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌పై విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సుమారు ఏడాదిన్నర క్రితం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా పలువురు నాయకులు దానిని అక్కడి నుంచి తొలగించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారికి ఫుట్‌పాత్‌పై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఇబ్బందికరంగా మారింది. కాగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ దానికి సమీపంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రజలకు ఇబ్బందిగా మారిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఫుట్‌పాత్‌పై నుంచి తొలగించి మరోచోట ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయమై మండల విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా త్వరలో ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించి మరోచోట ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



నార్లాపూర్‌లో నీటిని తొలగిస్తున్న సిబ్బంది

నిజాంపేట(మెదక్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని నిజాంపేట ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజేందర్ సూచించారు. ఈమేరకు మండల పరిధిలోని నార్లాపూర్, నందిగామ గ్రామాల్లో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు పరిశుభ్రత పాటించాలని.. ప్రతి ఆదివారం ఇళ్లలో నీటి తొట్టీలను శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరసేనారెడ్డి, కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, ఆరీఫ్ హుస్సేన్, ఆశవర్కర్ గౌరీ, అంగన్‌వాడీ టీచర్ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం



ధ్వంసమైన దామరంచ బీటీ రోడ్డు

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజాధనంతో రోడ్లు నిర్మిస్తుంటే నిబంధనలు పాటించని ట్రాక్టర్ యజమానులతో అవి ధ్వంసమవుతున్నాయి. బీటీ, మెటల్ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించడంతో కొద్ది రోజులకే రోడ్లు పాడవుతున్నాయి. వాటిపైనే యథేచ్ఛగా కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు తిరుగుతుండడంతో మరింత అధ్వాన్నంగా తయారవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండడంతో ప్రధాన రోడ్లపై నుంచే కేజ్‌వీల్స్‌ను తిప్పుతున్నారు. దీంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. అధికారులు వీటిపై నిఘా ఉంచి చర్య లు తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశలో పనిచేయడం లేద నే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం



కేజ్‌వీల్స్‌తో రోడ్లపై తిరిగితే కేసులు నమోదు చేస్తాం. వాహన చట్టం కింద సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పొలం పనులు జరుగుతున్నప్పుడు ట్రాక్టర్ల వాడకం ఎక్కువగా ఉంటుంది. ట్రాక్టర్ నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలి.

– మధుసూదన్‌గౌడ్, ఎస్సై, వెల్దుర్తి

వానాకాలం.. కరెంట్‌తో భద్రం

మనోహరాబాద్(తూప్రాన్): వానాకాలంలో కరెంట్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ కృష్ణ తెలిపారు. ఆదివారం కాళ్లకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలు అధికంగా కురుస్తుండడంతో విద్యుత్ తీగలు తెగిపడే అవకాశం ఉందని.. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరూ మరమ్మతులు చేయవద్దని హెచ్చరించారు.

చాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులోని మంజీరా తీరంలో వెలిసిన చాముండేశ్వరీ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

మెదక్ మున్సిపాలిటీ: ముప్పై ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా ఒక్కటయ్యారు. మెదక్ పట్టణంలోని గణేష్ స్టడీ పాయింట్ ట్యూషన్ పదో తరగతి 1993–94కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని బీకే భారత్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ గత స్మృతులు జ్ఞప్తికి తెచ్చుకొని ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు శ్రీహరి, దత్తాత్రేయ కులకర్ణి, శ్రీనివాస్, ప్రసాద్, నారాయణరెడ్డిలను పూలమాలలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

- మెలకువలు పాటిస్తే మేలు
- రైతులకు ఏఓ శ్వేత కుమారి సూచనలు

వర్షాభావం.. పత్తికి శాపం



కోనాపూర్ శివారులో వర్షపు నీటిలో పత్తి పంట (ఇన్‌సెట్‌లో) ఏఓ శ్వేత కుమారి

కొల్చారం(నర్సాపూర్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో నీరు నిలిచింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో మండలంలో ఇప్పటివరకు సుమారు 1,150 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుతం కొన్ని చోట్ల విత్తనాలు మొలకెత్తుతుండగా.. మరికొన్ని చోట్ల మొక్కలు కొంతమేర పెరిగాయి. ప్రస్తుతం పంటలో వర్షం నీరు నిలవడంతో మొక్క కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వర్షం ఇలాగే కొనసాగితే పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. ఇదే విషయమై కొల్చారం వ్యవసాయాధికారి శ్వేతకుమారి స్పందిస్తూ ప్రస్తుత తరుణంలో పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంటను అధిక వర్షాలు నుంచి రక్షించుకోవడానికి కాల్వ ఏర్పాటు చేసుకుని నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలన్నారు. వర్షాలు తగ్గి పొడి వాతావరణం ఏర్పడిన వెంటనే వీలైనంత త్వరగా అంతర కృషి చేసి నేలలో తేమ శాతం తగ్గేటట్టు చూడాలని పేర్కొన్నారు. పంట ఎదుగుదల పెంచడానికి ఎకరానికి 25 కిలోల యూరియాతో పాటు 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ మొక్కల మొదల్లో వేయాలని చెప్పారు. పంట ఎండిపోవడం గమనిస్తే లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్ మొక్క అడుగుభాగం తడిసే విధంగా 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండుమార్లు పిచికారీ చేయాలన్నారు. మరింత సమాచారం కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

చేగుంట(తూప్రాన్): బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఇబ్రహీంపూర్‌లో ఇటీవల మృతి చెందిన కావేరి కుటుంబీకులను పరామర్శించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింటూ, నాయకులు నర్సింలు, లక్ష్మణ్, వార్డు సభ్యులు అశోక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్‌లో అల్లర్లను కట్టడి చేయాలి'

చిన్నశంకరంపేట(మెదక్): మణిపూర్‌లో ఆదివాసి మహిళలపై జరిగిన అఘాయిత్యంపై కేంద్రం వెంటనే స్పందించాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి బందెల సాయిలు, చిన్నశంకరంపేట మండల అధ్యక్షుడు ముత్తిగల్ల రామచంద్రం డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయన్నారు.

రామాయంపేట(మెదక్): మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలను నివారించడంలో కేంద్రం వైఫల్యం చెందిందని కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు తార్యానాయక్ ఆరోపించారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



చెత్తను తొలగిస్తున్న యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యువత 275వ వారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం గ్రామంలోని 1, 2వ వార్డులో గడ్డి, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు ప్లాస్టిక్, చెత్త చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాప్సికం పంటకు నష్టం



వర్షంతో దెబ్బతిన్న పంట

కౌడిపల్లి(నర్సాపూర్): ఎడతెరిపి లేని వర్షాలు ఆరుతడి పంటలకు నష్టం కలిగించాయి. ఏపుగా పెరిగి చేతికొచ్చిన క్యాప్సికం పంటకు తీవ్రంగా నష్టం జరిగింది. మండలంలోని మహ్మద్‌నగర్‌కు చెందిన రైతు మహిపాల్‌రెడ్డి కౌడిపల్లిలో నాలుగు ఎకరాల్లో క్యాప్సికం సాగు చేశాడు. ఎకరాకు రూ. లక్ష చొప్పున ఖర్చుచేశాడు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఆకు రాలిపోయి మొక్క కుళ్లిపోతుంది. కాయలు వాడిపోయి నేల రాలుతున్నాయి. ఇక పంట చేజారిపోయిందని రైతు వాపోయాడు.

మహనీయులకు నివాళి

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో స్వామి వివేకానంద గ్రంథాలయం వద్ద ఆదివారం దేశభక్తి దివాస్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా బాలాగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నాని, మణివర్ధన్, గిరి, మురళి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



తూప్రాన్: బోనాలతో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పెద్దశంకరంపేట(మెదక్): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. సామూహిక సహపంక్తి భోజనం నిర్వహించి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు పల్లెబోయిన రాములు, కార్మికులు దాసు, సంగయ్య, రత్నయ్య, కిష్టయ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతుంది. తమ న్యాయమైన పలు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శివశంకర్ అన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): జీపీ కార్మికుల సమ్మె ఆదివారం కొనసాగింది. మండల జీపీ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎల్లం మాట్లాడుతూ.. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని చెప్పారు.

మనోహరాబాద్(తూప్రాన్): తమ గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పంచాయతీ కార్మికులు ఆదివారం దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్మిక సంఘం కార్యదర్శి ఆసిఫ్, మండల నాయకులు వీరేష్, స్వామి, అంజయ్య, మహేందర్, రమేష్, లక్ష్మీ, ఎల్లం పాల్గొన్నారు.

బోనాలతో వినూత్న నిరసన

తూప్రాన్: పంచాయతీ కార్మికులు తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆదివారం వినూత్నంగా నిరసన తెలిపారు. బోనాలు, పోతరాజుల విన్యాసాలతో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం నుంచి మహంకాళి దేవాలయం వరకు రహదారిపై ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



మనోహరాబాద్: దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు